
సాక్షి బాపట్ల

గురువారం । 7 । మార్చి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 515.00 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్. కరికల వలవన్ దంపతులు బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు.

యార్డుకు 1,44,511 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,44,511 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,38,827 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

బాపట్ల అడిషనల్ ఎస్పీ బదిలీ

అడిషనల్ ఎస్పీగా విఠలేశ్వర్ నియామకం

బాపట్లటౌన్: బాపట్ల జిల్లాలో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న పి.మహేష్‌ను విశాఖపట్నం జిల్లా, క్రైం విభాగం అడిషనల్ డీసీపీగా బదిలీ చేశారు. బాపట్ల జిల్లాకు ఏసీబీ విభాగంలో అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న టి.పి.విఠలేశ్వర్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేసింది.

ఉద్యోగినులకు ఆటల పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ, ఇంజినీరింగ్ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగినులకు జెడ్పీ ప్రాంగణంలోని మైదానంలో ఆటల పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ సమాజంలో పురుషులతో పోటీ పడి మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని సూచించారు. నిరంతరం వృత్తి జీవితంలో బిజీగా ఉంటున్న ఉద్యోగినుల్లో ఉత్సాహం నింపేందుకు పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ, కాకుమాను జెడ్పీటీసీ గుల్జార్ బేగం, ఉద్యోగినులు పాల్గొన్నారు.

మిర్చి యార్డుకు మూడు రోజులు సెలవులు

కొరిటెపాడు(గుంటూరు) శివరాత్రి పండుగ సందర్భంగా గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. శుక్రవారం శివరాత్రి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. అంతేకాకుండా శని, ఆదివారాలు సాధారణ సెలవులు కలుపుకొని మొత్తం మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించడం జరిగిందని మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ సెక్రటరీ, యార్డు ఇన్‌చార్జి సెక్రటరీ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. యార్డులో 11వ తేదీ నుంచి యథావిధిగా క్రయ, విక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు. సెలవు రోజుల్లో రైతులు మిర్చి బస్తాలను యార్డుకు తీసుకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాజీబాబా ఆదాయం రూ.13.28 లక్షలు



పెదకాకాని: బాజీబాబా దర్గాలో హుండీ కానుకల ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగిందని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్, దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా అన్నారు. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారుల ఆదేశాల మేరకు బుధవారం హుండీ తెరిచి కానుకలు లెక్కించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సూపరింటెండెంట్ షేక్ హైదర్ బాషా పర్యవేక్షణలో వీడియో నిఘా, పోలీసు బందోబస్తుతో కానుకల లెక్కింపు చేపట్టారు. దర్గాలోని మొత్తం 6 హుండీలు ద్వారా బాజీబాబా వారికి రూ.13,28,050 ఆదాయం లభించింది. గడిచిన ఐదు నెలల కాలానికి ఈ ఆదాయం లభించిందని ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. వక్ఫ్ బోర్డు అసిస్టెంట్ సెక్రటరీ షేక్ ఆదం షఫీ, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుభానీ, రెవెన్యూ, పోలీసు, దర్గా సిబ్బంది, కెనరాబ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ డీసీగా బాబ్జీరావు



నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గుంటూరు జోన్ డెప్యూటీ కమిషనర్‌గా ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు బుధవారం గుంటూరులోని ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జోన్ డీసీగా పనిచేస్తున్న బాబ్జీరావు గుంటూరు జోన్ డీసీగా బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ డీసీగా పనిచేసిన టి.శ్రీనివాసరావు ఏపీఎస్‌బీసీఎల్ డీజీఎంగా బదిలీపై హెడ్ క్వార్టర్స్‌కు వెళ్లారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6000, గరిష్ట ధర రూ.7700, మోడల్ ధర రూ.6800 వరకు పలికింది.

సర్వం శివోహం!

- మహాశివరాత్రి తిరునాళ్లకు సిద్ధమైన శైవక్షేత్రాలు
- చినగంజాంలో భారీ ఏర్పాట్లు
- నాలుగు శతాబ్దాల చరిత్ర గలిగిన ఆలయాలకు నెలవు
- చిన్న కోటప్పకొండగా ప్రసిద్ధిపొందిన బాలకోటేశ్వరస్వామి ఆలయం
- 17 ఎకరాల్లో నిర్మితమైన రామకోటేశ్వర స్వామి ఆలయం



కొత్తపాలెంలోని బాలకోటేశ్వర స్వామి దేవస్థానం (ఇన్‌సెట్‌లో) బాలకోటేశ్వరస్వామి మూలవిరాట్

చినగంజాం: మహాశివరాత్రి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు మండలంలోని రెండు శైవ క్షేత్రాల్లో భారీఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాఘ కృష్ణ చతుర్దశి నాడు వచ్చే మహాశివరాత్రి చినగంజాం మండలంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకుంటారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీలోని బాల కోటేశ్వర స్వామి ఆలయం, చినగంజాం పంచాయతీలోని సోపిరాల గ్రామంలోని రామకోటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి ఏడాది శివరాత్రి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు.

ఆలయ ప్రాశస్త్యం..

ప్రస్తుతం బాలకోటేశ్వర స్వామి ఆలయం నిర్మించిన ప్రాంతం వందల సంవత్సరాల క్రితం వ్యవసాయ భూమి కాగా కోకి వంశానికి చెందిన ఓ రైతు నీటిని భూమి నుంచి తోడి పోసుకునే నిమిత్తం పెద్ద గుంతను తవ్వాడు. అతని గునపానికి ఒక రాయి తగిలి రక్తం చిందడం, రైతు తవ్వుతున్న గుంతలో చిన్న శివలింగం బయల్పడటంతో శివుడు స్వయంభూగా తమ ప్రాంతంలో వెలిశాడని భావించి పూజలు చేయడం ప్రారంభించారు. శివలింగం చిన్నదిగా ఉండటంతో స్వామికి బాలకోటేశ్వరుడు అని నామకరణం చేసి గుడి నిర్మాణం చేసుకుని, శివరాత్రి పండుగను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. గుడి నిర్వాహణ కోకి వంశీయులు చేస్తూ తరువాత కాలంలో ఆర్థిక ఇబ్బందులు కారణంగా చేయలేకపోయారు. దీంతో గుడిని నిర్మించాలని మద్దుకూరి నారాయణరావును స్థానికులు కోరడంతో ఆయన కొద్దిపాటి గుడిని నిర్మించారు. ఆయన తదనంతరం కోకి వంశీయులకు తిరిగి గుడి నిర్వహణ అప్పగించడంతో అప్పటినుంచి ఆయన పేరుతో నారాయణ ప్రభ నిర్మించి గుడివద్దకు రెండు రోజుల ముందుగా చేర్చేవారు. అటు తరువాత కోకి వంశీయులకు తిరునాళ్ల భారం కావడంతో 80వ దశకంలో వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా ఎంప్లాయీస్ యూనియన్‌గా ఏర్పడి గుడి బాధ్యతలను నిర్వహిస్తూ ఉత్సవాలను కొనసాగిస్తున్నారు.

రామకోటేశ్వర స్వామి ఆలయ ప్రాశస్త్యం ఇదే..

సోపిరాల గ్రామ ప్రజలంతా సామాజికంగా ఐక్యతగా ఏర్పాటై నిర్మించుకున్న దేవాలయం రామకోటేశ్వర స్వామి ఆలయం. గతంలో ఈ గ్రామంలోని ప్రజలు కూడా ప్రభలు నిర్మించుకొని ఊరేగింపుగా బాల కోటేశ్వ స్వామి దేవాలయానికి వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించేవారు. అటు తరువాత కాలంలో రెండు సామాజిక వర్గాల నడుమ తలెత్తిన కొద్దిపాటి వ్యత్యాసం రామకోటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి పునాదులు వేశాయి. గుడి నిర్మాణం కోసం అప్పటి గ్రామ పెద్ద తుమ్మలపెంట వెంకట స్వామి నేతృత్వంలో సోపిరాల గ్రామ ప్రజలంతా నిధులు సేకరించి గుడి నిర్మాణం పూర్తి చేశారు. దీని నిర్మాణానికి ఆ గ్రామంలోని ప్రతి ఒక్కరూ కృషి చేసి సాయ మందించినవారే. అప్పట్లో సుమారు 17 ఎకరాల స్థలంలో గుడి నిర్మాణం చేసి కాశీ నుంచి శివ లింగాన్ని తెప్పించి ప్రతిష్ట నిర్వహించారు. గుడి నిర్మాణం జరిగిన దగ్గర నుంచి సోపిరాల ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడంతో, ఆలయాన్ని అభివృద్ధి పరచి ఆలయంలో విఘ్నేశ్వర, లలితాంబ, సుబ్రమణ్యేశ్వర ఆలయాలతో పాటు శని విగ్రహాలను ఏర్పాటు చేశారు. గుడి గాలి గోపురాన్ని దివంగత పెదరామారావు ఆధ్వర్యంలో భారీ వ్యయంతో అత్యంత రమణీయంగా తీర్చి దిద్దారు. వెంకట స్వామి కుమారుడు రామారావు గ్రామం తరఫున బాధ్యత తీసుకొని ఆలయ అభివృద్ధికి గుడి నిధులతో అభివృద్ధి చేశారు. ఆయన అనంతరం ప్రస్తుతం ఆ బాధ్యతలను ఆయన సోదరుడు సీతారామాంజనేయులు, గ్రామ ప్రజలంతా ఐక్యంగా నిర్వాహణ బాధ్యతలు చూస్తున్నారు. గత ఐదు దశాబ్దాలుగా గుడి ప్రాంగణంలో శివరాత్రి పండగను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. గుడి నిర్మాణం జరిగినప్పటి నుంచి సోపిరాల గ్రామంలోని ప్రజలు ప్రతి ఇంటికి ఒక ప్రభను నిర్మించుకొని గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగింపు నిర్వహించు కుంటూ ఆలయానికి తీసుకెళ్లేవారు. రెండో రోజు గ్రామంలో మరో సారి భారీగా ఊరేగింపు నిర్వహించేవారు. తిరునాళ్లను రెండు రోజులపాటు అత్యంత జరుపుకొనేవారు. రానురాను పరిస్థితుల అనుకూలించక గుడి దగ్గరే ప్రభలు నిర్మించే సంస్కృతి వచ్చింది. ఈ ఏడాది గత వైభవానికి తీసి పోకుండా ప్రభలను నిర్మించి తిరుణాళ్ల నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు.

చిన్న కోటప్పకొండగా ప్రసిద్ధి..

రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన కోటప్పకొండ తరువాత జిల్లాలో చినగంజాం మండలంలో శివరాత్రి తిరునాళ్ల అంతటి ప్రసిద్ధి పొందింది. శ్రీశైలం, మహానంది, కోటప్పకొండ, అమరావతి తదితర పుణ్యక్షేత్రాలతో పాటు చిన్న కోటప్పకొండగా పిలువబడే మహిమ గల దేవాలయం శ్రీ బాలకోటేశ్వర స్వామి దేవాలయం చినగంజాం మండలంలో ఉండటం విశేషం. కొత్తపాలెం పంచాయతీలో 101 శివలింగాలతో బాలకోటేశ్వరస్వామి దేవస్థానం నెలకొని ఉండగా, దేవాలయానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. శుక్రవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రెండు దేవాలయాల ఉత్సవ కమిటీలు భారీ ఏర్పాట్లు చేశాయి. శివరాత్రికి రూ.కోటిపైగా వెచ్చించి నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ దేవాలయంలో బాలకోటేశ్వరుడు స్వయంభుగా వెలిశాడు.





సోపిరాలలోని రామకోటేశ్వర దేవస్థానం (ఇన్‌సెట్‌లో) రామకోటేశ్వర స్వామి మూలవిరాట్

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



ఈవీఎంలు భద్రపరిచే కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: పార్లమెంటు, శాసనసభ–2024 ఎన్నికలకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను కట్టుదిట్టమైన భద్రత మధ్య సిద్ధంగా ఉంచామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎంలు ఉంచిన గోదామును రాజకీయ పార్టీల నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈవీఎంలు వినియోగిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఆరు నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఈవీఎం గోడౌన్ జిల్లా నోడల్ ఆఫీసర్ సుధాకర్ బాబు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ఏఓ కృష్ణ కాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతా రామయ్య పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి...

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు వివిధ రాజకీయ పక్షాలు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా కోరారు. బుధవారం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పక్షాలతో జిల్లా కలెక్టర్ సమావేశమై, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వర్క్‌షాప్ నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో రాజకీయ పక్షాలు చేయవల్సిన పనులు, చేయకూడని పనులు గురించి వర్క్‌షాప్‌లో వివరించారు.

సొంతింటి కల నెరవేర్చిన జగనన్న

- వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి
- సంతమాగులూరులో 456 మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ



మహిళకు ఇంటి రిజిస్ట్రేషన్ పట్టా అందజేస్తున్న పానెం చిన హనిమిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): పేదవారి సొంతింటి కల నెరవేర్చి, వారి చేతికి పట్టా అందించడం రాజన్న బిడ్డ జగనన్నకే సాధ్యమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. బుధవారం సంతమాగులూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యక్రమంలో 456 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాను పంపిణీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత రెండు దశాబ్దాలుగా ఏ ప్రభుత్వమైనా ఇంటి స్థలం ఇచ్చిందా అని ప్రశ్నించారు. పాదయాత్ర సమయంలో పేదల గోడు విన్న జగనన్న నేను ఉన్నాను, నేను విన్నాను అంటూ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు జీఓ జారీ చేశారన్నారు. దానికి టీడీపీ అడ్డు పడి కోర్టులకు వెళ్లిందని గుర్తు చేశారు. ఎన్నో అడ్డంకులను దాటుకుని అనుకున్న విధంగా నేడు పేదలందరికీ ఇళ్ల స్థలం ఇచ్చి అందులో ఇంటిని మంజూరు చేయించారన్నారు. ఆ ఇళ్లలో ఆయా కుటుంబాలు హాయిగా నివాసం ఉంటూ ఉన్నాయన్నారు. దానికి తోడు ఇప్పుడు వారికి ఇంటి రిజిస్ట్రేషన్ పట్టాలు కూడా ఇచ్చే కార్యక్రమాన్ని జరుగుతోందన్నారు. నేడు ఒక్కో జనగన్న కాలనీకి వెళితే.. అవి కాలనీలా లేక ఊళ్లా అనే సందేహం కలగకమానదన్నారు. అక్కడ మౌలిక వసతుల కల్పనతోపాటు, వారి సమస్యలను పరిష్కరిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. అద్దంకిని మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా అంతా సహకరించాలని చెప్పారు. ఎంపీడీఓ కాశయ్య, తహసీల్దార్ ప్రశాంతి, బొల్లినేని రామకృష్ణ, ఇప్పల ముసలారెడ్డి, ఓరుగంటి కోటిరెడ్డి, కారసాని వెంకటకోటిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటి నుంచే ఉచిత విద్యుత్!

- 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్
- ఇంటి అవసరాలకు మించి ఉత్పత్తి చేస్తే ప్రభుత్వమే నగదు చెల్లించి కొనుగోలు
- ప్రధాన మంత్రి సూర్యఘర్ మస్త్ బిజిలీ యోజన ద్వారా రాయితీ
- విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు



సోలార్ పథక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఈఈ మస్తాన్‌రావు, డీఈ ఏఈలు

అద్దంకి: ప్రజలు తమ ఇంటి నుంచే సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని ఉచితంగా వినియోగించుకునే అవకాశాన్ని ప్రధానమంత్రి సూర్యఘర్ మస్త్ బిజిలీ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం కల్పించినట్లు విద్యుత్ శాఖ అద్దంకి డివిజనల్ ఇంజినీరు మస్తాన్‌రావు చెప్పారు. కోటి ఇళ్లకు ఈ పథకం ద్వారా రూ.75 వేల కోట్ల రాయితీ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. స్థానిక ఈఈ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లకు వివరాలు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో 86 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా విద్యుత్ కనెక్షన్ ఉన్న ప్రతి వినియోగదారుడు తమ ఇంటి శ్లాబ్‌పై యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

యూనిట్ ఏర్పాటుకు రాయితీలు..

ఒక కేవీ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన యూనిట్ ఏర్పాటుకు రూ. రూ.55వేలు వ్యయం అవుతుండగా అందులో రూ.30వేలు రాయితీ పోతుందని చెప్పారు. 2 కిలోవాట్ల యూనిట్‌కు రూ. లక్ష వ్యయం కానుండగా, రూ.60 వేలు రాయితీ, 3 కిలోవాట్ల యూనిట్‌కు రూ.1.40 లక్షల వ్యయంకాగా, రూ.78 వేలు రాయితీ ఇస్తారని చెప్పారు. ఈ యూనిట్ కావాల్సినవారు http:// pmsuryaghar.gov. in వెబ్ సైట్లోకి వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. అలా రిజిస్టర్ చేసుకున్న తరువాత సోలార్ ప్యానెల్ ఏర్పాటు కోసం ముందే విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకున్న కంపెనీ ప్రతినిధిని (ఆన్‌లైన్ జాబితాలో) ఎంచుకుని, మొత్తం యూనిట్ వ్యయాన్ని చెల్లిస్తే ఆయా కంపెనీలకు చెందిన వారు ఇంటికి వచ్చి పరిశీలించి యూనిట్‌ను ఏర్పాటు చేస్తారని చెప్పారు. నెల రోజుల్లోగా రాయితీ నగదు వినియోగదారు వ్యక్తిగత ఖాతాకు జమ అవుతుందని వివరించారు. రిజిస్టర్ కోసం ఇంటి విద్యుత్ బిల్లు ఉంటే సరిపోతుందన్నారు. ఒక కేవీ యూనిట్‌కు నెలకు 100 యూనిట్లు, 2 కేవీ యూనిట్‌కు 200 యూనిట్లు, 3 కేవీ యూనిట్‌కు 300 యూనిట్లు ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఇంటి అవసరాలకు వినియోగంచుకున్న యూనిట్లు పోను మిగిలిన యూనిట్లకు, యూనిట్‌కు విద్యుత్ శాఖ ద్వారా రూ.4.17 చెల్లిస్తారని చెప్పారు. ఉత్పత్తి చేసిన యూనిట్లకు మించి వాడుకుంటే, విద్యుత్ శాఖ యూనిట్ శ్లాబు ధరల ప్రకారం బిల్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అచ్చం సోలార్ విద్యుత్‌ను వినిగియోంచుకునే వినియోగదారులు కేటగిరీ వన్‌కు 1కేవీకి రూ.45 వంతున, 2 కేవీకి రూ.65, 3 కేవీకి రూ.85 మినిమం బిల్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఒక కేవీ యూనిట్ ఏర్పాటుకు 8 నుంచి 10 చదరపు మీటర్లు, 2 కిలోవాట్ల యూనిట్ ఏర్పాటుకు 16 నుంచి 20 చదరపు మీటర్లు, 3 కిలోవాట్ల యూనిట్‌కు 32 నుంచి 40 చదరపు మీటర్ల విస్తీర్ణం ప్యానెల్ ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రగతి పథంలో ప్రభుత్వ పాఠశాలలు

- నాడు–నేడుతో మారిన బడుల రూపురేఖలు
- జిల్లా వ్యాప్తంగా 1433 పాఠశాలల్లో అభివృద్ధి పనులు
- రూ.200.89 కోట్ల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- మార్చి చివరి నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక ప్రణాళిక
- గడిచిన ఐదేళ్లల్లో గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య



నాడు–నేడులో భాగంగా అభివృద్ధి చేసిన భర్తిపూడి ప్రాథమిక పాఠశాల



ఫేజ్–2 పనుల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న ముత్తాయపాలెం జెడ్పీ పాఠశాల భవనం

బాపట్ల టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేటు పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించారు. పిల్లల చదువులకు కావాల్సిన వస్తువులను 'జగనన్న విద్యా కానుక' పేరుతో అందించారు. విద్యార్థులు చదువులో రాణించాలంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో 'జగనన్న గోరుముద్ద' పేరుతో పౌష్టికాహారం అందిస్తున్నారు. రోజుకో మెనూతో పాటు కోడిగుడ్డు, రాగి జావ, చిక్కీ అందజేస్తున్నారు. దీంతో పిల్లలు ఆరోగ్యకర వాతావరణంలో విద్యనభ్యసిస్తూ సంతోషంగా ఉన్నారు. వీటితో పాటు నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లోని విద్యార్థులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, కిచెన్ షెడ్లు, ఇంగ్లీష్ ల్యాబ్, మరుగుదొడ్లు తదితర వసతులను సమకూర్చారు. ఇప్పటికే ఫేజ్–1 పనులు ముగించిన అధికారులు తాజాగా ఫేజ్–2 పనులను నిర్వహిస్తున్నారు. ఫేజ్–2లో భాగంగా జిల్లాలో 71 అంగన్‌వాడీ కేంద్రాలు, 541 పాఠశాలలు, 11 జూనియర్ కళాశాలల్లో పనులు జరుగుతున్నాయి. వీటికి గానూ రూ. 190.10 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు రూ. 70.43 కోట్ల నిధులు విడుదల చేయటం జరిగింది. వీటితో పాటు ఫేజ్–2బి లో భాగంగా జిల్లాలో 563 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వాటికి గానూ రూ.7.40 కోట్లు నిధులను మంజూరు చేశారు.

నియోజకవర్గం	మొత్తం పాఠశాలలు	చేసిన పనులు	ఖర్చుచేసిన నిధులు
అద్దంకి	280	453	రూ.75.09 కోట్లు
బాపట్ల	210	237	రూ.45.08 కోట్లు
చీరాల	125	180	రూ.38.16 కోట్లు
పర్చూరు	263	371	రూ.53.70 కోట్లు
రేపల్లె	282	381	రూ.46.21 కోట్లు
వేమూరు	273	424	రూ.45.86 కోట్లు
మొత్తం	1433	2046	రూ.304.1 కోట్లు

పనుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

జిల్లాలో జరుగుతున్న నాడు– నేడు పనులకు సంబంధించిన పురోగతిపై సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. బృంద సభ్యులు పాఠశాలల్లో పనుల తీరుపై ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తున్నారు. పనులకు కావాల్సిన మెటీరియల్ సకాలంలో అందించడంతో పాటు పురోగతిని పర్యవేక్షిస్తూ నివేదికలను ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలతో పనులు



జిల్లాలో జరుగుతున్న నాడు–నేడు పనులు నాణ్యతలో రాజీ పడకుండా నిర్వహిస్తున్నాం. మాతో పాటు పాఠశాలల్లోని పేరెంట్స్ కమిటీలు, హెచ్‌ఎంలు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారులు సైతం పనుల నాణ్యతను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఫేజ్–2 పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లాలో ఫేజ్–2 కింద రూ.190.10 కోట్ల నిధులు మంజూరు చేయగా ఇప్పటివరకు రూ.73.40 కోట్లు విడుదలయ్యాయి. గడువు లోగా పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– ఎం. వెంకట సుధాకర్, జిల్లా సర్వశిక్షా అభియాన్ అధికారి

రైతులకు ప్రభుత్వం కొండంత అండ



చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎంపీ సురేష్ ఎమ్మెల్యే కరణం

బాపట్ల: మిగ్ జాం తుపానుతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని కొండంత భరోసా కల్పించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. మిగ్ జాం తుపానుతో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం పంపిణీ కార్యక్రమాన్ని తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బుధవారం బటన్ నొక్కి ప్రారంభించారు. జిల్లాలో నష్టపోయిన రైతులకు రూ.104.73కోట్ల పెట్టుబడి రాయితీ నగదును ప్రజా ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ చెక్కురూపంలో పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో 93,471 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. వారందరికీ పెట్టుబడి రాయితీ కింద రూ.104.73కోట్ల నగదును ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేసిందని తెలిపారు.

కోటప్పకొండకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- డిపో మేనేజర్ బి.వీరాస్వామి
- పల్నాడు, ప్రకాశం, బాపట్ల నుంచి 528 బస్సులు ఏర్పాటు
- 1300మంది అధికారులు, సిబ్బంది నియామకం
- నరసరావుపేట రైల్వేస్టేషన్ నుంచి కొండకు ఐదు బస్సులు



నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ వద్ద నిర్వహించే మహా తిరునాళ్లకు భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. డిపో ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కొండకు భక్తులను తీసుకొచ్చేందుకు ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి మొత్తం 528 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కొండ కింది నుంచి పైకి వీఐపీలను 20 సూపర్ లగ్జరీ బస్సుల ద్వారా తీసుకెళ్లటం జరుగుతుందని చెప్పారు. గురువారం రాత్రి 12 గంటల నుంచి 8వ తేదీ రాత్రి 12గంటల వరకు సర్వీసులు ఉంటాయని వివరించారు. దీంతో పాటు ప్రయాణికులను కొండ కింది నుంచి పైకి చేర్చేందుకు 60 తిరుమల– తిరుపతికి చెందిన సప్తగిరి బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు టిక్కెట్ ధరలు 2019 నుంచి ఉన్న వాటినే కొనసాగిస్తున్నామన్నారు. పట్టణంలోని చిత్రాలయ థియేటర్ నుంచి కూడా కొండకు బస్సులు తిరుగుతాయన్నారు. టికెట్ల కోసం అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాను, పోను టికెట్లు ఒకేసారి తీసుకున్న భక్తులు వాటిని తొమ్మిదో తేదీ ఉదయం 6గంటలవరకు ఉపయోగించవచ్చన్నారు. నరసరావుపేట రైల్వేస్టేషన్ నుంచి కొండవరకు ఐదు బస్సులను ఏర్పాటు చేశామని, ఇవి రైలు స్టేషన్‌కు వచ్చిన సమయంలోనే అందుబాటులో ఉంటాయన్నారు.

పుర పరిపాలన శాఖ - పిడుగురాళ్ల పురపాలక సంఘం

బహిరంగ వేలము పాటల ప్రకటన

పిడుగురాళ్ళ పురపాలక సంఘ పరిధిలో గల కూరగాయల మార్కెట్, సంబ్రీ మార్కెట్ మరియు చేపలు మాంసం మార్కెట్స్ యొక్క 2024-25వ ఆర్థిక సంవత్సరమునకు ఆశీలు వసూలు సంబంధించి గుత్త హక్కును పొందుటకు తేది 11.03.2024 సోమవారం సాయంత్రం 4.00 లకు మునిసిపల్ కార్యాలయము నందు బహిరంగ వేలంపాట నిర్వహించబడును.

సం/- కమీషనరు, పిడుగురాళ్ళ పురపాలక సంఘం

పురపాలక సంఘ కార్యాలయం, బాపట్ల

ఆర్.ఓ.సి.నెం.205/2002/ఎ1 తేది: 05.03.2024

బహిరంగ వేలం ప్రకటన

బాపట్ల పురపాలక సంఘము పరిధిలో గల ఈ దిగువ ఉదహరించబడిన మార్కెట్ల యందు 2024-2025 సం॥ అనగా ది.01.04.2024వ తేది నుండి ది.31.03.2025వ తేది వరకు ఆసరి రుసుము (ఆశీలు) వసూలు చేసుకొను హక్కు నిమిత్తం ది.14.03.2024న గురువారం ఉదయం గం॥11.00లకు పురపాలక సంఘ కార్యాలయములో కమీషనరు గారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన అధికారిచే గాని, గజిట్ నోటిఫికేషన్ నెం.08/2024, ది.05.03.2024 నిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించబడును. వేలములో పాల్గొను పాటదారులు ఈ దిగువ ఉదహరించబడిన ధరావత్తు చెల్లించి ధ్రువపత్రములు తప్పనిసరిగా దాఖలు చేయవలెను.

వ.నెం	వేలం పాట వివరములు	వేలం ధరావత్తు	సాల్వెన్సీ
1.	కూరగాయల మార్కెట్ సంబ్రీ మార్కెట్ ఆశీలు వసూలు చేసుకొనుట	రూ.2,00,000/-లు	రూ.12,00,000/-లు 15సం॥లకు పైబడి
2.	కూరగాయల మార్కెట్ లోపలి స్టాల్స్ 1 నుండి 76వరకు రోజువారీ అద్దెలు వసూలు చేసుకొనుట	రూ.1,50,000/-లు	రూ.10,00,000/-లు 15సం॥లకు పైబడి
3.	మాంసం మార్కెట్ మరియు జంతు వధశాల ఆశీలు వసూలు చేసుకొనుట	రూ.40,000/-లు	రూ.4,00,000/-లు 15సం॥లకు పైబడి
4.	చేపల మార్కెట్ ఆశీలు వసూలు చేసుకొనుట	రూ.25,000/-లు	రూ.2,50,000/-లు 15సం॥లకు పైబడి

పై తెలిపిన గుత్తలలో దేనినైనా, ఎట్టి కారణము తెలుపక నిలుపుదల చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని, తిరస్కరించుటకు గాని కమీషనరు గారికి పూర్తి అధికారము కలదు. ఇ.సి. సర్టిఫికెట్లను మున్సిపల్ కమీషనరు/యమ్.పి.డి.ఓ/యమ్.ఆర్.ఓ., లచే ధృవీకరించబడవలెను. ఇతర విషయములు, వివరములకు కార్యాలయము పనిచేయు వేళలలో సంబంధిత సెక్షన్ వారిని సంప్రదించి తెలుసుకొనవచ్చును.

సం/- టి.శ్రీకాంత్, కమీషనరు, బాపట్ల పురపాలక సంఘం

ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటా

- పానెం చిన హనిమిరెడ్డి
- రేణింగివరంలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

జె.పంగులూరు: ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. రేణింగివరంలో జాతీయ రహదారి వెంట వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. తొలుత గ్రామంలోని ఫ్లైఓవర్ ప్రారంభం నుంచి రేణింగివరం, జాగర్లమూడివారిపాలెం, మీదుగా ముప్పవరం వరకు, ముప్పవరం నుంచి పార్టీ కార్యాలయం వరకు వందలాది కార్యకర్తల నడుమ బైకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బైక్ నడిపి చిన హనిమిరెడ్డి పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నింపారు. అనంతరం ఏఎంసీ మాజీ చైర్మన్ పులికం కోటిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ 175 సీట్లు సాధించడం పెద్ద సమస్య కాదని చెప్పారు. ఈ నెల 10న నిర్వహించనున్న సిద్ధం సభ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతరావు, ఏఎంసీ చైర్మన్ జజ్జర ఈశ్వరమ్మ ఆనందరావు, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ జంపాని రవిబాబు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు రాము, రాష్ట్ర భట్రాజుల సంఘం డైరెక్టర్ చక్రవరం జ్యోతి, శిగర కొండ దేవాలయం మాజీ చైర్మన్ కోటా శ్రీనివాసరావు, చల్లా శ్రీధర్‌రెడ్డి, బి. రాఘునాథరావు, ఎస్. సురేష్, రాష్ట్ర రాజ్‌కుమార్, రవీంద్ర, చక్రవరం భాస్కర్‌రాజు, రామాంజనేయులు, కె.నాగేశ్వరావు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చిన హనిమిరెడ్డి

క్రీడల ఖిల్లా.. గుంటూరు జిల్లా

- ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి
- అంకిరెడ్డిపాలెంలో సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్ట్ ప్రారంభం

గుంటూరు రూరల్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తామెప్పుడూ సిద్ధంగా ఉంటామని ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు ఆయన చెప్పారు. సీఎం సంపూర్ణ సహకారంతో గుంటూరు జిల్లాను క్రీడల ఖిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన ప్రకటించారు. గుంటూరు రూరల్ అంకిరెడ్డిపాలెం సమగ్రాభివృద్ధిలో భాగంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన అత్యాధునిక సింథటిక్ బాస్కెట్ బాల్ కోర్టును స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకట రమణ దేవి, బ్రహ్మారెడ్డి, అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ నేతలు, క్రీడాధికారులతో కలిసి ఎమ్మెల్సీ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలసి ఆయన కొద్దిసేపు సరదాగా బాస్కెట్ బాల్ ఆడి వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ, విద్యారంగం తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు క్రీడారంగం ద్వారానే పుష్కలంగా లభిస్తున్నట్లు చెప్పారు. ముందు చూపు గల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యారంగం తర్వాత రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధికి పెద్ద పీట వేసినట్లు వెల్లడించారు. విద్యతో పాటు ఆయా క్రీడల పట్ల మక్కువ పెరిగేలా విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ఓవైపు బాస్కెట్ బాల్ కోర్టు మరోవైపు క్రికెట్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సుభాష్ చంద్రబోస్, సెక్రటరీ జి చక్రవర్తి, ద న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ ప్రెసిడెంట్ మారెళ్ళ రేవతి, సెక్రటరీ ఆంజనేయులు, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి వెంకటేశ్వరరావు, అంకిరెడ్డిపాలెం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కుర్రా పుల్లారెడ్డి, లేళ్ళ పెద్ద అప్పిరెడ్డి, కుర్రా సాంబిరెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి వీర గంగాధరరెడ్డి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, నూనె ఉమా మహేశ్వరరెడ్డి, పానుగంటి చైతన్య, పరిశపోగు శ్రీనివాసరావు, యోగేశ్వరరెడ్డి, కార్పొరేషన్ డీఈ కళ్యాణ్, బాస్కెట్ బాల్ కోచ్‌లు సుకన్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



అంకిరెడ్డిపాలెంలో బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి



బాస్కెట్‌బాల్ ఆడి కోర్టును ప్రారంభిస్తున్న అప్పిరెడ్డి

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే కరణం

చీరాల అర్బన్: చీరాల నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చీరాల నియోజకవర్గానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని తోటవారిపాలెం గ్రామంలో నూతనంగా రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. రూ.3.55 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ జరగని విధంగా ఈ ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ప్రతి ఒక్కరూ ఆదరించి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ మాట్లాడుతూ గతంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేసి చరిత్రలో జగనన్న ప్రభుత్వం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. అన్ని సామాజికవర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజకీయ ప్రాధాన్యం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభారాణి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పీఆర్ డీఈ శేషయ్య, ఏపీఎం సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎ.అంకాలరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బోయిన కేశవులు, ఆర్‌బీకే చైర్మన్ కె.రమణారెడ్డి, పార్టీ నాయకులు వెంకటేశ్వరమ్మ, బి.శివపార్వతి, జ్వాలా నరసింహం, కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

- ఆర్టీసీ బస్సులకు వన్‌వే అమలు
- 3,000 మంది సిబ్బందితో బందోబస్తు
- పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: మహాశివరాత్రికి కోటప్పకొండ పరిసరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి తెలిపారు. త్రికోటేశ్వరస్వామి ఉత్సవాల నేపథ్యంలో పోలీస్‌శాఖ తరఫున చేసిన ఏర్పాట్లపై బుధవారం ఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా వన్‌వేలను ప్రవేశపెట్టామన్నారు. కొండ పరిసరాలలో పార్కింగ్ సమాచారం కోసం కోటప్పకొండ పార్కింగ్ యాప్ రూపొందించినట్లు తెలిపారు. దీన్ని భక్తులు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. రూట్లు, పార్కింగ్, యాప్ తదితర సమాచారాన్ని పోలీస్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రోటోకాల్ దర్శనానికి ప్రత్యేక లైన్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. సుమారు 3,000 మంది పోలీస్ సిబ్బంది విధుల్లో నిర్వర్తించనున్నట్లు చెప్పారు. సెల్‌ఫోన్ నెటవర్క్ సమస్యలు రానున్న నేపథ్యంలో ఆయా కంపెనీల నుంచి తాత్కాలికంగా కొన్ని టవర్లను ఏర్పాటు చేయిస్తున్నామని వివరించారు. మత్తు పదార్థాలు తాగడం నిషేధమని చెప్పారు. రాజకీయ, వర్గాల సంబంధిత సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనుమతి లేదన్నారు. ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే కొండపైకి అనుమతిస్తున్నామని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, ఎస్బీ సీఐ ప్రభాకర్ ఉన్నారు.

నరసరావుపేట వైపు నుంచి కోటప్పకొండకు వచ్చే వారు ...

- నరసరావుపేట నుంచి కోటప్పకొండకు వచ్చు భక్తులు/వీఐపీలు వారి వాహనాలు, ఆర్టీసీ బస్సులలో ఉప్పలపాడు, పెట్లూరివారిపాలెం మీదుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవాలి.
- తిరుగు ప్రయాణంలో పార్కింగ్ వెనుక వైపు ఏర్పాటు చేయబడిన మట్టి రోడ్డును ఉపయోగించి కొండకావూరు మీదుగా పమిడిమర్రు రోడ్డును చేరి జేఎన్‌టీయూ కాలేజీ మీదుగా కాకాని రోడ్‌లో వెళ్లాలి.

సంతమాగులూరు వైపు నుంచి..

- సంతమాగులూరు నుంచి వచ్చే భక్తులు లక్ష్మీపురం కాలువ రోడ్డును ఉపయోగించి మిన్నెకల్లు, గురిజేపల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. మిన్నేకల్లు నుంచి కోటప్పకొండ వైపు వాహనాలు అనుమతించబడవు.
- సంతమాగులూరు నుంచి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో గురుజేపల్లి మీదుగా సంతమాగులూరు వెళ్లాలి.

చిలకలూరిపేట వైపు నుంచి..

- చిలకలూరిపేట నుండి వచ్చే భక్తులు పురుషోత్తపట్నం, యడవల్లి, యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలను ఉపయోగించుకోవాలి.
- చిలకలూరిపేట నుంచి వచ్చే వీఐపీలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి ఎడమ వైపుకు తిరిగి క్రషర్ రోడ్ ను ఉపయోగించి వీఐపీ పార్కింగ్‌లో వాహనాలు ఉంచి, వీఐపీ బస్‌లలోనే కొండపైకి చేరుకోవాలి.
- తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్‌ను చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా చెరువు రోడ్డు చేరి చిలకలూరిపేట వెళ్లాల్సి ఉంటుంది.
- చిలకలూరిపేట నుంచి వెళ్లే ప్రభలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి నిధి దారి గుండా ప్రభల స్టాండుకు చేరాలి.
- చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టల ఫ్యాక్టరీ రోడ్ మీదుగా యక్కలవారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్‌కు చేరాలి.
- చిలకలూరిపేట వైపు తిరిగి వెళ్లే భక్తులు శారద ఫార్మసీ దగ్గరలో పార్కింగ్ నుంచి ఆర్టీసీ బస్సులు, కార్లు యూటీ జంక్షన్ చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా గోవిందాపురం, కోమటినేని వారి పాలెం మీదుగా నరసరావుపేట– చిలకలూరిపేట రోడ్డుకు చేరి చిలకలూరిపేట వెళ్లాల్సి ఉంటుంది.
- గంగన్నపాలెం, కోమటనేనివారి పాలెం నుంచి వచ్చే భక్తులు గోవిందాపురం, కమ్మవారిపాలెం మీదుగా మద్దిరాల చేరి యడవల్లి యూటీ జంక్షన్‌ల మీదుగా పార్కింగ్ ప్రదేశం చేరాలి.
- అవిశాయపాలెం, కేసానుపల్లి మీదుగా కోటప్పకొండకు వచ్చే భక్తులు ఎస్ఆర్‌కేటీ చేరి, యలమంద గ్రామం మీదుగా కోటప్పకొండ రావాలి.
- యలమంద, గురువాయపాలెం వైపు నుంచి వచ్చు భక్తులు బాతింగ్ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన ఐరన్ బ్రిడ్జ్ వద్దకు చేరి, యాదవ సత్రానికి వెనుక ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలను పార్కు చేసుకోవాలి.



మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, చిత్రంలో డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, సీఐ ప్రభాకర్

ప్రభలు ఇలా...

- నరసరావుపేట టౌన్ నుంచి కోటప్పకొండకి వచ్చే ప్రభలు ఉదయం 10 గంటలకు బయలదేరి వయా యల్లమంద, గురవాయపాలెం గ్రామాల మీదుగా సాయంత్రం 4 గంటలకి ప్రభల నిధి వద్దకి చేరుకోవాలి.. తరువాత అనుమతించబడవు.
- రెడ్ల సత్రం, యాదవ సత్రాల వైపు నుంచి రాత్రి ఒంటి తరువాత తిరిగి వెళ్లే వాహనాలు ఐరన్ బ్రిడ్జి మీదుగా గోనేపూడి, కేసానుపల్లి మీదుగా నరసరావుపేట వైపుకు గాని చిలకలూరిపేట వైపుకు గాని వెళ్లాల్సి ఉంది.
- ఏఎం రెడ్డి కాలేజ్ జంక్షన్ నుంచి వాహనాలు బైకులు కాలుకట్ట పైకి అనుమతి లేదు.
- కొండపైకి నడిచి వెళ్లే భక్తులు మెట్ల దారిలో మాత్రమే నడచి వెళ్లాలి.. ఘాట్ రోడ్‌లో భక్తులు కాలి నడకన వెళ్లేందుకు ఎలాంటి అనుమతులు లేవు.

వైద్యకళాశాలలో మహిళా దినోత్సవం



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ మెడికో ఉద్యోగ సంఘం గుంటూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని అసోసియేషన్ కార్యాలయంలో మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళ విభాగం అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పోటీపడడం శుభ పరిణామమని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర మహిళ విభాగం అధ్యక్షురాలు సుగుణ, జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పట్ల తమ సంఘం చిత్తశుద్ధితో పోరాటం చేస్తుందన్నారు. వేడుకల్లో పద్మజ, హేమలత, రోజారాణి, నీలిమ, లీలాబాయి, శారదా తదితరులు పాల్గొన్నారు.

నల్లపాడు సీఐ సస్పెన్షన్

నగరంపాలెం: గుంటూరు జిల్లాలోని నల్లపాడు పోలీస్‌స్టేషన్ (పీఎస్) సీఐ రాంబాబుపై సస్పెన్షన్ వేటు పడింది. గుంటూరు రూరల్ మండలం ఓ గ్రామ పరిధిలో స్థలం వివాదం దృష్ట్యా ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ డీపీఓలోని స్పందనలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ క్రమంలో సదరు సీఐపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం నివేదికను గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజుకి విన్నవించినట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు సీఐపై సస్పెన్షన్ విధించారు. గతేడాదిలో సీఐగా ఉద్యోగోన్నతి పొందిన ఆయనకు సీఐగా తొలి పోస్టింగ్‌ను నల్లపాడు పీఎస్‌కు కేటాయించారు. కొద్ది నెలల వ్యవధిలోనే సస్పెన్షన్ వేటుపడటం గమనార్హం.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల డిబార్

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్ చేస్తు పట్టుబడ్డారు. బుధవారం జూనియర్ ఇంటర్మీడియెట్ గణితశాస్త్రం-1 పరీక్షలో గురజాల .ఉఆర్‌ఆర్ నవోదయ కళాశాలలో ఒకరు, చిలకలూరిపేట మోడరన్ జూనియర్ కళాశాలలో ఒకరు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడినట్టు ఇంటర్ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారి టి.శేఖరబాబు తెలిపారు. కాగా, జిల్లాలో జూనియర్ ఇంటర్మీడియెట్ పరీక్షకు 885 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. జనరల్ ఇంటర్మీడియెట్‌లో 16,149మందికి గాను 15,414 మంది హాజరయ్యారని, మరో 735 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులు 925 మందికి గాను 805 మంది హాజరుకాగా, 120 మంది గైర్హాజరయ్యారు.


వైభవం.. బ్రహ్మోత్సవం

పెదకాకాని శివాలయంలో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు


పెదకాకాని: శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఉత్సవాలను బుధవారం అర్చకులు పూజా కార్యక్రమాలతో సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. మల్లేశ్వరస్వామివారిని పెండ్లి కుమారునిగా, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. ఆలయంలో తెల్లవారుజామున 5 గంటలకే సుప్రభాత సేవ, పంచహారతులతో పూజా కార్యక్రమాల క్రతువు ప్రారంభమైంది. శైవాగమ పద్ధతిలో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చకుడు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు పర్యవేక్షణలో అర్చకస్వాములు, వేద పండితులు తొలిరోజు ప్రత్యేక పూజలు జరిపించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదు, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెండవరోజు గురువారం శ్రీ భ్రమరాంబ అమ్మవారిని వనదుర్గాదేవిగా అలంకరించడం జరుగుతుందని, ప్రత్యేక వేదికపై శ్రీరామలింగ ప్రతిష్ఠ ఏర్పాటు చేయడం జరుగుతుందని, సాయంత్రం 6 గంటలకు నరనంది వాహనంపై అత్యంత వైభవంగా గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ ఉప కమీషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు తెలియజేశారు.

ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు..

పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ ఉప కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఉచిత అన్నప్రసాదాన్ని ప్రారంభించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యులు కొమ్మూరి కోటిరత్నాలు, కారంకి నాగేశ్వరమ్మ, మందాళ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.



పెండ్లికుమార్తెగా భ్రమరాంబ అమ్మవారు



పూజా క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు